క్లుప్తంగా

నేడు రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గుంటూరు రూరల్: రూరల్ మండలం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆదినారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ ఇంటూరి పద్మావతి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, పంచాయితీ కార్యదర్శులు, మండల స్థాయి అన్ని విభాగాల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఆక్రమణల తొలగింపు సమయంలో భద్రత కల్పించండి

ఎస్‌ఐను కోరిన డీఎల్‌పీఓ లక్ష్మణరావు

ప్రత్తిపాడు: ఆక్రమణల తొలగింపునకు భద్రత కల్పించాలని డీఎల్‌పీఓ కె.లక్ష్మణరావు ఎస్‌ఐ నాగేంద్రను కోరారు. స్థానిక పోలీస్ స్టేషనులో బుధవారం ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ షేక్ ఖాజా, పంచాయతీ కార్యదర్శి జాన్‌పీరాలతో కలిసి డీఎల్‌పీఓ ఎస్‌ఐను కలిశారు. రక్షిత మంచినీటి చెరువు కట్టపై ఉన్న ఆక్రమణల తొలగింపునకు సంబంధించిన అంశం కోర్టు ధిక్కరణ పరిధిలోనికి వెళ్లిందని, అందుచేత సాధ్యమైనంత త్వరగా ఆక్రమణలు తొలగించాల్సి ఉందని అధికారులు ఎస్‌ఐకు వివరించారు. గతంలో తొలగింపు సమయంలో చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎస్‌ఐ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. వెంట ఫిర్యాదుదారుడు కమ్మా శివప్రసాద్, అధికారులు ఉన్నారు.

నేత్ర సమస్యలపై అశ్రద్ధ తగదు

వేజండ్ల(చేబ్రోలు): గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గుంటూరుకు చెందిన వాసన్ ఐకేర్ కంటి వైద్య నిపుణులు టి.స్రవంతి అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసన్ ఐకేర్ వైద్య నిపుణులు గ్రామస్తులకు కంటి సమస్యలపై అవగాహన కల్పించి 112మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. వీరిలో 31 మందికి శుక్లాలు మరియు పొరలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్‌లు చేయనున్నట్లు తెలిపారు. కంటి వైద్య నిపుణులు స్రవంతి మాట్లాడుతూ నేత్ర సమస్యలపై అశ్రద్ధ చేయకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వాసన్ ఐకేర్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజానీకానికి మెడికల్ క్యాంపుల ద్వారా ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్నామని, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. నేత్ర వైద్య సిబ్బంది ఎ.వెంకట్రావు, పి.వినోద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నీటిశుద్ధి నాణ్యతపై అవగాహన

ప్రత్తిపాడు: వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు నీటి శుద్ధి, నాణ్యతలపై అవగాహన సదస్సును నిర్వహించారు. హాజరైన వాటర్ ఎయిడ్ సంస్థ గుంటూరు జిల్లా కో–ఆర్డినేటర్ సురేష్ నీటి శుద్ధి ప్రాముఖ్యతను అంగన్‌వాడీలకు వివరించారు. మానవ మనుగడకు నీరు ప్రాముఖ్యమని, అందుచేత ప్రతిఒక్కరు నీటి నాణ్యత, శుద్ధి చేసే విధానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామ నీటి పారిశుద్ధ్య కమిటీలో సభ్యులుగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు పంచాయతీల్లోని ఫీల్డ్ టెస్టింగ్ కిట్ల ద్వారా నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించాలని, గ్రామాల్లో నీటి శుద్ధి జరుగుతుందా లేదా అన్న విషయాలను పరిశీలించాలన్నారు. అనంతరం నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత.. వంటి అంశాలను తెలిపే శిక్షణ దీపికను అంగన్‌వాడీలకు సంస్థ సభ్యులు అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వంద రోజులు పని కల్పించాలి

పెదకాకాని: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న వారందరికీ వంద రోజులు పని కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నన్నపనేని మట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 23వ తేదిన జాతీయ ఉపాధిహామీ పథకం పనులు నిర్ణయించేందుకు గ్రామసభలు ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ గ్రామసభల్లో ఉపాధిహామీ కూలీలు అందరికీ సమాచారం ఇచ్చి గ్రామసభలో పాల్గొనేలా చూడాలన్నారు. ఎంపీడీఓకు వినతిపత్రం అందజేసిన వారిలో ఎంపీటీసీ సభ్యుడు షేక్ అబ్దుల్ లతీఫ్, సీపీఎం నాయకుడు జి.రాజారమేష్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

ప్రత్తిపాడు: వ్యాపారస్తులు తమ దుకాణాల ముంగిట ఖచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ కె.నాగేంద్ర అన్నారు. ఇటీవల దొంగల అలజడులు కనిపిస్తున్న నేపథ్యంలో బుధవారం స్థానిక పోలీస్ స్టేషనులో వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించారు. పాత మద్రాసు రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. ఒక్కరే ఏర్పాటు చేసుకోవడం ఇబ్బందికరంగా ఉంటే నలుగురైదుగురు కలిసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక బంద్ ప్రశాంతం

ప్రత్తిపాడులో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన


ప్రత్తిపాడులో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నేతలు

ప్రత్తిపాడు: వర్గీకరణకు వ్యతిరేకిస్తూ నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో మాల మహానాడు నేతలు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరు–పర్చూరు పాతమద్రాసు రోడ్డులోని బస్టాండు సెంటరులో ఉన్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి తొలుత పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వార్థ రాజకీయాలు మానుకోవాలని నినాదాలు చేశారు. దాసరి చెంచు రామారావు, నేలటూరి అనిల్, భాగ్యారావు, వాసిమళ్ల రత్నబాబు, యోహాన్, విజయ్, జోజి, ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు: ఎస్సీ కులాల రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జేఏసీ పిలుపు మేరకు బుధవారం పొన్నూరులో నిర్వహించిన బంద్ ప్రశాంతంగా సాగింది. మాల మహాసభ వ్యవస్థాపకులు మల్లెల వెంకట్రావు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ, ఎస్సీ ఎస్టీ వర్గీకరణపై అప్రజాస్వామిక, రాజ్యాంగ విరుద్ధమైన తీర్పును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బంద్ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయించారు. వాహనాలను నిలిపివేయడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ముందస్తుగా సెలవును ప్రకటించాయి. పొన్నూరు ఆర్టీసీ డిపో పరిధిలోని 38 బస్సులు తెల్లవారుజామునుంచే నిలిచిపోయాయి. సుమారు రూ.6లక్షల వరకు ఆర్టీసీకి నష్టం వాటిల్లినట్లు డిపో అధికారులు తెలిపారు.


పొన్నూరులో మూతబడ్డ దుకాణాలు

పెదకాకానిలో...

పెదకాకాని: కులాల మధ్య విభేదాలు సృష్టిస్తూ, కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న మతోన్మాద వ్యతిరేక విధానాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అంబేడ్కర్ ఇండియా మిషన్ జిల్లా అధ్యక్షుడు పల్లె నరేష్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా జరిగిన భారత్ బంద్‌లో భాగంగా మాల మహానాడు ఐక్యవేదిక ఆధ్వర్యంలో పెదకాకానిలో బంద్ నిర్వహించారు. జాతీయ రహదారిపైకి చేరుకుని వాహనాల రాకపోకలను నిలిపివేసి నిరసన తెలియజేశారు. ప్రభుత్వ కార్యాలయాలను, పాఠశాలలను సైతం మూయించి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కంతేటి యలమందరావు, అమిరే పున్నయ్య, నాగతేజ బండ్లమూడి చక్రి, దేవరపల్లి కిరణ్ ఎం.అనూక్, సుధాకర్, అశోక్, కోటేశ్వరరావు, వంశీ పాల్గొన్నారు.


పెదకాకానిలో నిరసన వ్యక్తం చేస్తున్న అంబేడ్కర్ ఇండియా మిషన్ సభ్యులు

ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను కలిసిన అంబటి

శాసన మండలి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయ కర్త అంబటి మురళీకృష్ణ బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. బొత్స సత్యనారాయణ ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసేందుకు వెళుతున్న సమయంలో విజయవాడలోని కార్యాలయంలో అంబటి మురళీకృష్ణ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

– పొన్నూరు


బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న అంబటి మురళీకృష్ణ

ప్రమాదకర విన్యాసాలతో ప్రాణాలకు ముప్పు

గుంటూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.మల్లేశ్వరి



ప్రత్తిపాడు: యువత ప్రమాదకర విన్యాసాలతో ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారని గుంటూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.మల్లేశ్వరి అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కెకెఆర్ అండ్ కెఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (కిట్స్)లో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తెనాలి ఎంవీఐ తోట రాఘవరావు, గుంటూరు ఎంవీఐ టి.మల్లేశ్వరిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు రహదారి భద్రతను పాటించాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో నూతన పోకడలకు అలవాటు పడి నలుగురి దృష్టినీ ఆకర్షించాలనే ఉద్దేశ్యంతో ప్రమాదకరంగా విన్యాసాలు చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. రవాణాశాఖ, పోలీస్‌శాఖల సూచనలకు అనుగుణంగా చోదకులు వాహనాలను నడిపితే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఎంవీఐ రాఘవరావు మాట్లాడుతూ మనదేశంలో అత్యధిక మరణాలు రహదారి దుర్ఘటనల వలన జరుగుతున్నాయని, నిత్యం వేల మంది తమ అమూల్యమైన ప్రాణాలను కోల్పోతున్నారని చెప్పారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్పలో వసతుల కల్పనకు చర్యలు

- నగరపాలక సంస్థ కమిషనర్ పి.శ్రీనివాసులు
- చౌడవరంలో గృహ సముదాయాల పరిశీలన

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని 26వ డివిజన్ నందున్న చౌడవరం గ్రామం రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో మౌలిక వసతులను కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ చౌడవరంలోని రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనులను పరిశీలించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడుతూ గృహకల్ప బ్లాక్‌ల పరిసరాల్లో పిచ్చి మొక్కలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రెండు రోజుల్లో జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డీడీ గ్రౌండ్ వాటర్ వారితో సమన్వయం చేసుకొని, గృహకల్ప సముదాయంలో రెండు ప్రాంతాల్లో బోర్లు వేయడానికి పాయింట్లు గుర్తించి, అంచనాలు సిద్ధం చేయాలన్నారు. అపార్ట్‌మెంట్ పైన ఉన్న నీటి ట్యాంక్‌లు, వాటిలో ప్రస్తుతం వినియోగంలో ఉన్నవి, లేనివి, నూతనంగా అవసరమైన వాటి వివరాలతో గురువారానికి నివేదిక ఇవ్వాలని ఏఈని ఆదేశించారు. గృహకల్ప నివాసాలకు ఆస్తి పన్ను వేయడానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారిని ఆదేశించారు. చెత్త సేకరణ, డ్రైన్ల శుభ్రం జరగాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ని, కార్యదర్శిని ఆదేశించారు. చౌడవరం మెయిన్ రోడ్‌లోని జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్‌పై డ్రెయిన్ నీరు వస్తుందని, సదరు అధికారులతో సమన్వయం చేసుకొని సమస్య పరిష్కారనికి చర్యలు తీసుకోవాలని ఈఈని ఆదేశించారు. ఆయనవెంట ఈఈ కొండారెడ్డి, ఏఈ రవికిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ శ్రీనివాసులు

‘ఉపాధి’ మేట్ పొట్టకొడుతున్న కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడనే నెపంతో నోటీసులు
- కనీసం విచారించకుండానే నోటీసు ఇచ్చిన ఏపీడీ

గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీకి చెందిన వారు గ్రామాల్లో చిరు ఉద్యోగాలు కూడా చేయటానికి వీల్లేదని కూటమి నేతలు హుకూం జారీ చేస్తున్నారు. కూటమి పార్టీ నేతలకు చెందినవారే ఉద్యోగాలు చేయాలి, మిగతా వారు స్వచ్ఛందంగా తప్పుకోవాలి.. లేదంటే ఏదోరూపంలో వారిని తప్పిస్తారు. కూటమి అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి అన్ని గ్రామాల్లో ఇదే తంతు.. తాజాగా చల్లావారిపాలెంలో ఇటువంటి ఘటనే జరిగింది.

వివరాల్లోకి వెళితే.. చల్లావారిపాలెం గ్రామంకు చెందిన కర్పూరపు వీరాంజనేయులు 2015 నుంచి ఉపాధి హామీ విభాగంలో గత పదేళ్లుగా చల్లావారిపాలెం గ్రామంలో సీనియర్‌మేట్‌గా పనిచేస్తున్నాడు. 2015 నుంచి 2019 వరకూ తనకు కనీసం ఐదేళ్ల పాటు జీతం ఇవ్వకున్నా ఎప్పటికైనా వేతనం వస్తుందనే ఆశతో పనిచేశాడు. అనంతరం 2020లో గ్రామంలోని నాయకులు సంబంధిత అధికారుల చుట్టూ తిరిగి ఎట్టకేలకు 2020 ఏప్రిల్ నుంచి వీరాంజనేయులుకు జీతం వచ్చేలా చేశారు. అప్పటినుంచి ఇప్పటివరకూ నెలకు రూ.6,500 జీతం తీసుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటూ ఉపాధి హామీపనులు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలోని నాయకులు వీరాంజనేయులుపై వైఎస్సార్ సీపీకి సానుభూతి పరుడని ముద్రవేసి, సంబంధిత శాఖ పీడీ ఎదుట ఫిర్యాదులు చేశారు. దీనిపై పీడీ ఏపీడీని విచారణ జరిపించాలని ఆదేశించగా, ఏపీడీ సత్యనారాయణ కనీసం గ్రామంలో విచారణ చేయకుండానే వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడని, రాజకీయపార్టీలతో సంబంధాలున్నాయని నోటీసులు ఇవ్వటంతోపాటు, ఉద్యోగంనుంచి తప్పుకోవాలని బెదిరింపులకు పాల్పడుతున్నాడని బాధితుడు వీరాంజనేయులు వాపోతున్నాడు. ఏపీడీ కనీసం గ్రామంలోకి వచ్చి తనపై వచ్చిన ఆరోపణలపై విచారణకూడా చేయకుండానే నోటీసులు జారీ చేయటంపై బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. పదేళ్లుగా కుటుంబానికి ఆదరువుగా ఉన్న ఉద్యోగం కోల్పోతే తాను, తన కుటుంబం రోడ్డున పడాల్సి వస్తుందని, తనకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నాడు. కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు సైతం చిరు ఉద్యోగులపై ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడటం ఎంతో దురదృష్టకరమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారించి, చిరుద్యోగికి న్యాయం చేయాలని కోరుతున్నారు.


బాధితుడికి ఏపీడీ ఇచ్చిన నోటీసు


బాధితుడు వీరాంజనేయులు

పది విద్యార్థులకు బేస్‌లైన్ టెస్ట్

ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో యాభై మార్కులకు పరీక్షలు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్షను నిర్వహించారు. ఈ పాఠశాలలో ప్రస్తుతం సీబీఎస్‌ఈ విధానం అమలవుతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థుల విద్యా సామర్థ్యం తెలుసుకునేందుకు ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు జరుగుతున్నాయి. వాస్తవానికి ఈ నెల 12వ తేదీ నుంచి పరీక్షలు జరగాల్సి ఉన్నప్పటికీ సాంకేతిక కారణాలతో వాయిదా వేశారు. అనంతరం 19 నుంచి జరగాల్సి ఉన్నప్పటికీ మరో మారు వాయిదా పడింది. ఈ నేపథ్యంలో 21వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరగనున్న పరీక్షల్లో భాగంగా బుధవారం ఇంగ్లీషు పరీక్షను నిర్వహించారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3.30 గంటల వరకు జరిగిన ఈ బేస్‌లైన్ పరీక్షలో యాభై ప్రశ్నలతో కూడిన ఆన్‌లైన్ ప్రశ్నపత్రం ద్వారా యాభై మార్కులకు బేస్‌లైన్ టెస్ట్ రాశారు. 22వ తేదీన గణితం, 23న సామాన్యశాస్త్రం, 24న సాంఘికశాస్త్రం పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు జరుగుతున్న విధానాన్ని మండల విద్యాశాఖాధికారులు సీహెచ్. రమాదేవి, ఎంఈఓ–2 జి. లీలారాణిలు స్థానిక హెచ్‌ఎం హెచ్. శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు.

కాకుమానులో...

కాకుమాను: ప్రతి విద్యార్థి సీబీఎస్ విధానం అలవాటు చేసుకునే విధంగా ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల(బాలికల)పాఠశాలలో ఈ ఏడాది పది పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థినులకు బుధవారం ట్యాబ్ ఆధారిత బేస్ లైన్ టెస్టు నిర్వహించారు. ఈసందర్భంగా కెనడీ మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి పదవ తరగతి విద్యార్థినులకు సీబీఎస్‌ఈ విధానంలో బోధన జరుగున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి విద్యార్థినికి ట్యాబ్‌లపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించే విధంగా ప్రతి ఉపాధ్యాయిని కృషి చేయాలని ఆయన సూచించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సి.హెచ్. పద్మజా రమ్య, ఉపాధ్యాయినిలు డి.హవీలా ప్రియదర్శిని, ఎం.రాధ ఉన్నారు.

ప్రతి ఇంటికీ ఒక మొక్క

జిల్లా పంచాయతీ అధికారి కె. శ్రీదేవి


ఇన్‌చార్జి ఎంపీడీఓ రామకోటయ్యతో మాట్లాడుతున్న డీపీఓ శ్రీదేవి, జెడ్పీ సీఈఓ

ప్రత్తిపాడు: గ్రామంలో ప్రతి ఇంటికీ ఒక మొక్క నాటేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పంచాయతీ అధికారి కె.శ్రీదేవి అన్నారు. స్పెషల్ ప్లాంటేషన్‌లో భాగంగా మండల పరిధిలోని నిమ్మగడ్డవారిపాలెంలో ఈ నెల 24వ తేదీన పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించనున్న విషయం తెలిసిందే. తొలుత నిమ్మగడ్డవారిపాలెం నుంచి కొత్తమల్లాయపాలెం వెళ్లే రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలని అధికారులు భావించారు. అయితే గ్రామంలోనే మొక్కలు నాటాలని కలెక్టర్ సూచించడంతో అనువైన స్థలాన్ని, ఏర్పాట్లును బుధవారం డీపీఓ శ్రీదేవి, జిల్లా పరిషత్ సీఈఓ ఎస్‌ఎస్‌వీబీ వసంతరాయుడు, డిప్యూటీ సీఈఓ జె.మోహనరావులు పరిశీలించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ రామకోటయ్యతో పాటు పంచాయతీ కార్యదర్శి శ్రీదేవిలతో మాట్లాడారు. గ్రామంలో ప్రతి నివాసంలో మొక్కలు నాటడంతో పాటు అంతర్గత వీధుల్లో, రక్షిత మంచినీటి చెరువు గట్లపైనా మొక్కలు నాటేలా యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించాలన్నారు. అదేవిధంగా మొక్కలు దాతల సహకారంతో సమకూర్చుకోవాలని ఆదేశించారు. ఉపాధిహామీ సిబ్బందితో గుంతలు తీయించాలని సూచించారు. ఆయవెంట ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా, గ్రామస్తులు నిమ్మగడ్డ సతీష్‌కుమార్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులున్నారు.

నైపుణ్యాభివృద్ధితో ఉన్నత శిఖరాలకు...

నాక్ పీర్ టీం చైర్మన్ మాణిక్‌రావు సాలుంఖే

చేబ్రోలు: విద్యార్థులు సాధారణ డిగ్రీతో పాటు నైపుణ్యాభివృద్ధి సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నాక్ పీర్ టీం చైర్మన్ మాణిక్‌రావు సాలుంఖే అన్నారు. చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాక్ పీర్ టీం బుధవారం సందర్శించింది. నాక్ టీం చైర్మన్ ప్రొఫెసర్ మాణిక్యరావు, సాలుంఖే, నాక్ బృందం సభ్యులు ప్రొఫెసర్ సంజీవకుమార్ మహాజన్, డాక్టర్ కృష్ణ, సి.మిశ్రా తదితరులతో పాటు కళాశాల ప్రాంతీయ సంయుక్త సంచాలకులు పి.కళావతి డిగ్రీ కళాశాలను సందర్శించిన వారిలో ఉన్నారు నాక్ చైర్మన్ మాణిక్యరావు సాలుంఖే మాట్లాడుతూ నూతన విద్యావిధానం 2020ను అనుసరించి విద్యాబోధన అమలు చేయాలని సూచించారు. మధ్యాహ్నం జరిగిన తల్లి దండ్రుల సమావేశం, పూర్వ విద్యార్థుల సమావేశాల్లో నాక్ బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ వి.శ్రీదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.


చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పరిశీలిస్తున్న నాక్ పీర్ టీం చైర్మన్ మాణిక్‌రావు సాలుంఖే

ప్రీ స్కూల్ పిల్లల నమోదు పెంచాలి

ప్రత్తిపాడు: ప్రీస్కూల్ పిల్లల నమోదును పెంచాలని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వి.సుజాతదేవి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం ప్రాజెక్టు పరిధిలోని పెదనందిపాడు, కాకుమాను మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సుజాతదేవి మాట్లాడుతూ రిజిస్టర్ల నిర్వహణ ఖచ్చితంగా ఉండాలన్నారు. స్టాక్ రిజిస్టర్లును ఎప్పటికప్పుడు అప్ టు డేట్‌గా ఉంచాలని చెప్పారు. గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రీ స్కూల్ పిల్లలు ఎక్కువ మంది అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేలా అంగ్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎత్తు, బరువులను నిక్కచ్చిగా నమోదు చేయాలని సూచించారు. చాలా కేంద్రాల్లో చిన్నారులు ఉన్న ఎత్తు, బరువులకు, వాస్తవ పరిస్థితులకు వ్యత్యాసం ఉంటుందన్నారు. అందుచేత ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త తమ పరిధిలోని చిన్నారుల ఎత్తు, బరువులను మరోసారి పరిశీలించి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. కేంద్రాల్లో చిన్నారులకు అందించే భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీధోరణి అవలంభించవద్దని సీడీపీవో చెప్పారు. అడిషనల్ సీడీపీఓ విజయనిర్మల, సెక్టార్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


సీడీపీఓకు సౌండ్ సిస్టమ్‌ను అందజేస్తున్న ఉప్పలపాడు అంగన్‌వాడీ కార్యకర్త భాగ్యలక్ష్మి

స్పీకర్, సౌండ్ సిస్టమ్ బహూకరణ..

పెదనందిపాడు మండలం ఉప్పలపాడు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త నెల్లూరి భాగ్యలక్ష్మి ప్రత్తిపాడు ప్రాజెక్టుకు స్పీకర్, సౌండ్ సిస్టమ్‌ను బహూకరించారు.

టిడ్కో గృహాల్లో సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు: టిడ్కో గృహాల్లో నివాసముంటున్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం నిడుబ్రోలులోని టిడ్కో గృహాలను ఆయన సందర్శించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య, పారిశుద్ధ్యం, పోలీసు సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ఇంకా రిజిస్ట్రేషన్ కాని ఫ్లాట్లకు సంబంధించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏజెన్సీ వారు కనీస సౌకర్యాలైన నీరు, వీధి దీపాలు, పరిశుభ్రత తదితరాలను పర్యవేక్షించాలని సూచించారు. జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు, మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్, డీఈ ఏడుకొండలు, కూటమి నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

ఆర్‌వీఆర్ జేసీలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన

గుంటూరు రూరల్: విపత్తులను అధిగమించే విధంగా టెక్నాలజీని మరింత మెరుగుపరచడంలో విద్యార్థులు తమ ప్రతిభను పెంపొందించుకోవాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్విరాన్మెంట్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ పి.బ్రహ్మాజీరావు పేర్కొన్నారు. బుధవారం చౌడవరం గ్రామంలోని ఆర్వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో డిజాస్టర్ మేనేజ్మెంట్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తు పరిణామాల నివారణకు చేపట్టవలసిన చర్యలను వివరించారు. విద్యార్థులు తమ నైపుణ్యంతో వాతావరణంలో సంభవించే మార్పులను నివారించడంలో విపత్తు సందర్భాలను ముందుగానే పసిగట్టడంలో తమ మేధాశక్తితో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి సమాజ శ్రేయస్సులో భాగస్వాములవ్వాలని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల నివారణలో విద్యార్థులు ప్రభుత్వ సంస్థలకు తోడ్పాటు అందించాలని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని విద్యార్థులను సూచించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రాణ నష్టంతో పాటుగా, దాని ప్రభావం వర్తక, వాణిజ్య, వ్యాపార రంగాలపై అధికంగా ఉండి ఆర్థిక సంక్షోభానికి దారి తీస్తుందని దీనిని అధిగమించేందుకు గ్రీన్ ఎనర్జీ గ్లోబల్ సాధనలో విద్యార్థులు ప్రధాన పాత్ర పోషించాలని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ రాయపాటి గోపాల కృష్ణ, కళాశాల ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్ పిలుపు నిచ్చారు. కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ – అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎస్.వి. శ్రీనివాసరావు, కళాశాల డిసాస్టర్ మేనేజ్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ వై.సుమంత్, కమిటీ సభ్యులు అతిథులను సన్మానించారు.

వంతెన గోడలపై మొక్కలు .. అశ్రద్ధ చేస్తే బీటలు



పొన్నూరు: పట్టణ ప్రధాన సెంటర్‌లోని నిడుబ్రోలు వంతెన అధికారుల నిర్లక్ష్యానికి సాక్ష్యంగా మారింది. రేపల్లెకు వెళ్లే దారిలోని వంతెన నిర్వహణ సక్రమంగా లేదు. వంతెన గోడలపై మొలిచిన మొక్కలు పెరిగి చెట్లుగా మారుతున్నాయి. ప్రధాన రహదారిలోని వంతెన గోడలపై పగుళ్లు ఏర్పడటంతో వాటిలో చెట్లు పెరుగుతున్నాయి. వర్షం కురిసినపుడు ఆ పగుళ్లలోని మట్టి కరిగి కిందికి చేరుతోంది. వంతెన గోడపై సుమారు పదికి పైగా చెట్లు పెరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. వాటిని ఇప్పుడే తొలగించకపోతే బీటలు వారే ప్రమాదం ఉంది. అధికారులు వెంటనే స్పందించి మొక్కలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ప్రత్తిపాడు డివిజన్

90109 57733 (ప్రత్తిపాడు)

90109 62225 (పొన్నూరు)

Office mail : sakshigntadvt@gmail.com